క్లుప్తంగా

క్రీడా మైదానం సిద్ధం



మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఈ నెల 26 నుంచి జరగనున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు సంబంధించి జగరాజుపల్లి వద్ద ఉన్న మోడల్‌స్కూల్ క్రీడా మైదానం సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆవరణ చుట్టూ ఉన్న రాళ్లు, పిచ్చి మొక్కలు తొలగింపజేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గురునాథ్, పీడీ అజీం బాష, సెక్రటరీ జయపాల్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కదిరి టౌన్: నల్లమాడ మండలం మీసాలపల్లికి చెందిన వడ్డె శివయ్య బేల్దారి పనిచేస్తూ ప్రమాదవశాత్తు ఎడమ చేతి మూడు వేళ్లు కోల్పోయాడు. కదిరి అమీర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని దీనస్థితి తెలుసుకున్న కదిరి వడ్డెర్ల సంఘం నాయకులు సంపంగి గోవర్ధన్, సైదాపురం రమణ బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నారాయణస్వామి, శ్రీనివాసులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: విద్యుత్ పొదుపు పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందని విద్యుత్‌శాఖ ఏఈ నాగభూషణం, కొండారెడ్డి, ఏఏఓ రామకృష్ణలు తెలిపారు. ధర్మవరం పట్టణంలో బుధవారం విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకుని భావితరాలకు భరోసా ఇవ్వాలని సూచించారు.

గురుకుల పాఠశాల తనిఖీ

తనకల్లు: మండల పరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలను జిల్లా పరిషత్ సాంఘిక సంక్షేమ జిల్లా కమిటీ (స్టాండింగ్ కమిటీ) సభ్యురాలు, కదిరి జెడ్పీటీసీ భూక్యా రాధా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడారు. కొన్ని తరగతులలో సిలబస్ పూర్తి కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. టీచర్స్ పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ మ్యాథ్, సోషియల్, సైన్స్ సబ్జెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. వర్కర్లను నియమించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు.

తనకల్లుకు చేరిన పాదయాత్ర



బసవరావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

తనకల్లు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని మంగళగిరికి చెందిన కట్టిపోగు బసవరావు చేపట్టిన పాదయాత్ర బుధవారం తనకల్లుకు చేరింది. ఆయనను వైఎస్సార్ సీపీ నాయకులు రామ్‌దేశాయ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బీఎస్ నిజాం, రాజశేఖర్‌రెడ్డి, వెంకటరమణ, తిమ్మయ్య, మహబూబ్‌పీరా, సాయి ప్రతాప్, మల్లికార్జున పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

పుట్టపర్తి: తమ డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని సమగ్ర సర్వ శిక్ష అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట సమ్మె ప్రారంభించారు. వైఎస్సార్‌టీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్-1938 సంఘం నేతలు రమణారెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. సర్వ శిక్ష అవుట్ సోర్సింగ్ జేఏసీ అధ్యక్షుడు ఓబిరెడ్డి తదితరులున్నారు.

వేరుశనగ పంట పరిశీలన



వేరుశనగ చెట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పుట్టపర్తి అర్బన్: కొత్తచెరువు మండలంలోని కొడపగానిపల్లికి చెందిన వేరుశనగ పొలాలను బుధవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రామసుబ్బయ్య, కిషోర్ కుమార్ పరిశీలించారు. మొవ్వ కుళ్లు, వేరుకుళ్లు తెగుళ్ల తీవ్రతను తట్టుకునేందుకు హెక్సాకొనజోల్ లేదా అసిఫేట్ 1.6 ఎంఎల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఎకరాకు 10 కిలోల యూరియా వేసుకోవాలని, పంట 45 రోజుల్లో జిప్సం 200 కిలోలు ఒక ఎకరాకు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రీ అసిస్టెంట్ సాయి కౌషిక్, రైతులు బయపరెడ్డి, అశోక్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపు



సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజలతో ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ప్రతాప్‌రెడ్డి, చెన్నక్రిష్టారెడ్డిలతో కలిసి మండలంలోని తనకంటువారిపల్లి, ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, నేలకోట, నేలకోట తండా, బిల్వంపల్లిల్లో ఆయన పర్యటించారు. మీ ఇంటి వద్దకే వచ్చా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఏమవ్వా పింఛన్ వస్తోందా.. జనవరి 1 నుంచి పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచుతున్నాడు మీ మనవడు జగన్‌మోహన్‌రెడ్డి అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి ప్రాధాన్యతను ఇస్తూ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలోపేతం చేశాడన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి అక్కడే అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా విప్లవాత్మక మార్పులు తెచ్చాడన్నారు. గతంలో ఏ చిన్న పని ఉన్నా కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలాలకు వెళ్లి అధికారుల కోసం వేచివుండాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. నేడు పనులన్నీ గంటల వ్యవధిలోనే సచివాలయాలకు వెళ్లి పరిష్కరించుకుంటున్నారన్నారు. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తు పూర్తి చేసి పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా అర్హత ఉన్న వారందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు పేదలను దోచుకుతిన్నాయన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ రామయ్య, మండల ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు గంగమ్మ, ఓబిరెడ్డి, రేగాటిపల్లి సురేష్ రెడ్డి, నాగానందరెడ్డి, నాయకులు గొట్లూరు సంగాలప్ప, రమేష్, మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, బిల్వంపల్లి కేశవ, హరి, బి.గోపాల్, పోతుకుంట రాజు, వెంకటేష్, జయరాం, సి.నారాయణరెడ్డి, ఎ.నారాయణరెడ్డి, క్రిష్ణమూర్తిరెడ్డి, పార్థసారథిరెడ్డి, అక్కులప్ప, దాసరి అంజినేయులు, బాలప్ప, కేశవ. ఓబిరెడ్డి, రవీంద్రారెడ్డి, జయపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ధర్మవరం రూరల్: ''గుండెల మీద చేయి వేసి చెబుతున్నా. ఒకప్పుడు ధర్మవరం నియోజకవర్గం ఎలా ఉంది. నేను ఎమ్మెల్యేగా వచ్చినప్పటి నుంచి ఎలా అభివృద్ధి చెందింది. నియోజకవర్గంలో ఏ ఒక్కరిని అడిగినా అభివృద్ధి అంటే కేతిరెడ్డి... కేతిరెడ్డి అంటేనే అభివృద్ధి అని చెబుతారు. ఇది ముమ్మాటికీ నిజం. అభివృద్ధే ధ్యేయంగా, నియోజకవర్గ ప్రజలే దేవుళ్లుగా భావిస్తూ ముందుకు వెళ్తుంటే ప్రతిపక్షాల నాయకులు అడ్డు తగులుతున్నారు. ఎవరెన్ని చేసినా నా కర్తవ్యం మరువను. రాష్ట్రానికే ఆదర్శంగా నియోజకవర్గాన్ని తీర్చుదిద్దుతా'' అని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని ఏలుకుంట్ల, నేలకోట పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెలే మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.3,024 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.5,677 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఏలుకుంట్ల పంచాయతీలో రూ.2.40 కోట్లు, నేలకోట పంచాయతీలో రూ.2.16 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తాడిమర్రిలో రూ.2,250 కోట్లతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ముదిగుబ్బ మండలంలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను రూ. 692 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రూ.668 కోట్లతో జిల్లేడు బండ ప్రాజెక్ట్, రూ.635 కోట్లతో నేషనల్ హైవే రోడ్లు, రూ.410 కోట్లతో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.234 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి, రూ.172.29 కోట్లతో గ్రామాల్లో పనులు, రూ.172 కోట్లతో చిత్రావతి ముంపు పరిహారం, రూ.132 కోట్లతో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్, కదిరి రైల్వే గేటుపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు, రూ.75.15 కోట్ల విలువైన భూమిని పేదలకు పంపిణీ చేయడం, రూ. 72 కోట్లతో గరుడంపల్లి వద్ద వేరుశనగ శుద్ధి కేంద్రం ఏర్పాటు పనులు, రూ.22.53 కోట్లతో నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, రూ.15.90 కోట్లతో ఎంసీహెచ్ అండ్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం, రూ.7.50 కోట్లతో ధర్మవరం కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి పరచామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీలు ప్రతాప్‌రెడ్డి, చెన్నకిష్టారెడ్డి, సర్పంచ్‌లు గంగమ్మ, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారనున్న పురాతన ఆలయాల రూపురేఖలు

- రూ.2 కోట్ల నిధుల విడుదల

ధర్మవరం: పట్టణంలోని సిద్ధయ్యగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం, పీఆర్‌టీ సర్కిల్‌లోని పాండురంగస్వామి ఆలయాల రూపురేఖలు మారనున్నాయి. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రత్యేక కృషితో ప్రభుత్వం రూ.2 కోట్లు నిధుల మంజూరు చేసింది. రెండు ఆలయాల పునఃనిర్మాణం కోసం ఒక్కో ఆలయానికి రూ.కోటి నిధులు కమిటీ సభ్యులు రూ.25 లక్షలు వెచ్చించేలా జీఓలు ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలో పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అతి పురాతన ఆలయాల పునఃనిర్మాణానికి నిధులు విడుదల కావడంతో పట్టణప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సుప్రియ

ముదిగుబ్బ: మండల పరిధిలోని మంగళమడక గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ రూ.50 వేలను విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆమె ఎమ్మెల్యే నివాసంలో గ్రామ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌మోహన్‌రెడ్డి, రామక్రిష్ణ, రాజగోపాల్‌రెడ్డి, నాగభూషణం, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ధర్మవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని 25వ వార్డులో బుధవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్, వార్డు సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, పట్టణాధ్యక్షుడు బాలిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలు, మతాలు, కులాలు చూడకుండా టీడీపీ నాయకుల ఇళ్లకు కూడా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం వార్డులో చేసిన అభివృద్ధి పనుల బ్యానర్ విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ పార్టీ జెండాను ఎగురవేసి ఇంటింటా తిరుగుతూ ప్రజలకు జగన్ పాలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తంరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు చాంద్‌బాషా, కత్తె పెద్దన్న, శ్రీనివాసులు, జింకా కంబగిరి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దోచుకుంది.. దాచుకుంది టీడీపీ వాళ్లే

- హౌసింగ్, భూ దందా జరిగింది టీడీపీ హయాంలోనే
- పచ్చకుట్రపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు

రామగిరి: దోచుకుంది... దాచుకుంది టీడీపీ వాళ్లే.. హౌసింగ్, భూదందాలతో రూ.కోట్లను జేబులు నింపుకున్నారని ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కక్రా హనుమంతరెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ హెచ్ఎస్ ముత్యాలు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన రామగిరిలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుధవారం ఓ పత్రికలో భూదందాలో వైసీపీ గద్దలు అనే పేరుతో అసత్య కథనాన్ని ప్రచురించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతం పరిటాల కుటుంబ ఆధీనంలో ఉందని, వారు చెప్పిందే వేదంగా జరుగుతూ వచ్చిందన్నారు. అధికారులను, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది నిజం కాదా ? అని ప్రశ్నించారు. గతంలో అప్పటి ఎమ్మెల్యే పరిటాల సునీత తమ అనుచరులతో కలసి హౌసింగ్ నిర్మాణాల్లో నసనకోట, ఎంసీపల్లి పంచాయతీల్లో లక్షల్లో అవినీతి చేశారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భూదందాలతో పాటు ఇసుక అక్రమ రవాణా, నీరు–చెట్టులో దోచుకుంది.. దాచుకుంది ప్రజలందరికీ తెలుసన్నారు. ఒక్కసారిగా అధికారం కోల్పోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. వీళ్ల ఆగడాలకు భయపడి రామగిరి మండలానికి అధికారులు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందంటే వీళ్ల అవినీతి ఏస్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రం గ్రామాల్లో పర్యటించి అదిచేస్తాం... ఇది చేస్తాం అంటూ ప్రజలను మభ్యపెడుతూ ఆ తర్వాత మాయమవుతారన్నారు . రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా అన్నిచెరువులకు నీటిని అందించడంతో పాటు పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీటిని తెచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలుమాని ప్రజలకు సేవచేయాలని, లేకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాబోయే ఎన్నికల్లో మీరెన్ని కుట్రలు పన్నినా ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకే పట్టంకడతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మీనుగ నాగరాజు, నరేంద్ర, రాజేష్, సిద్ధన్న, రామ్మూర్తి, చెన్నకేశవరెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, ఓబిరెడ్డి, ఆదిరెడ్డి, నరసింహారెడ్డి, సూరి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నేడు 'పట్టా'భిషేకం



తారు రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి: సీఎం జగన్ పాలనలో పేద ప్రజలకు 'పట్టా'భిషేకం జరుగుతోంది. కదిరి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఇళ్లులేని నిరుపేదలు తన నియోజకవర్గంలో ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో ముందుకెళుతున్నారు. ఇప్పటికే కదిరి పట్టణ పరిధిలో 3,254 మందికి, కదిరి రూరల్ మండలంలో 236 మందికి, గాండ్లపెంట మండలంలో 293, ఎన్‌పీ కుంట మండలంలో 128, నల్లచెరువు మండలంలో 75, తలుపుల మండలంలో 273, తనకల్లు మండలంలో 243 మందికి మొత్తం 4,502 మంది నిరుపేదలకు 'వైఎస్సార్–జగనన్న' కాలనీల్లో పట్టాలు మంజూరు చేశారు.

సీఎం జన్మదినోత్సవంలో మరింత మందికి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం(నేడు) కదిరి పట్టణ పరిధిలో ఇంకా ఇల్లులేని, అర్హులైన మరో 1,500 మందికి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం మున్సిపల్ పరిధిలోని సర్వే నం.1, 21, 41, 1,777లలో సుమారు 25 ఎకరాల ప్రభుత్వ భూమిని సిద్ధం చేశారు. బుధవారం ఎమ్మెల్యే స్థలాలను సిద్ధం చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపుతున్నారు. సర్వే నం.21లో 3 ఎకరాల స్థలాన్ని పరిశీలిస్తున్నారు.

జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి

నల్లచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బంద్రేపల్లి, తవళంమర్రి గ్రామాల నుంచి తెల్లగుట్లపల్లి వరకూ రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక కదిరి నియోజకవర్గంలోని సుమారు 135 గ్రామాలకు అప్రోచ్ రోడ్లను వేశామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో దాదాపు రూ.కోటితో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కులం, మతం, వర్గం, పార్టీ అనే తేడా లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అంజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వినర్ హైదర్‌వలి, వైస్ ఎంపీపీ నారాయణప్వామి, సర్పంచ్ స్వర్ణలత, సొసైటీ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, డైరెక్టర్ ఆదిమూర్తి, జేసీఎస్ కన్వినర్ రాజశేఖర్, టెంపుల్ మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచులు, నాయకులు వై.రమణారెడ్డి,రత్న శేఖర్‌రెడ్డి, సానే హరినాథ్‌రెడ్డి, రమణారెడ్డి, సుధాకర్, ఆనంద్‌రెడ్డి, రఫి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం



కనగానపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లిలోని బీసీ కాలనీ– 2లో బుధవారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, డైరక్టర్ ప్రభాకర్, సర్పంచ్ రామక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ అశోక్, స్థానిక నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ షాక్‌తో గాయపడ్డ కూలీ

ఎన్‌పీకుంట: విద్యుత్ షాక్‌కు గురై ఓ దినసరి కూలీ గాయపడ్డాడు. వివరాలు... కదిరి మండలం బొడెనాయక్ తండాకు చెందిన రవినాయక్ దినసరి కూలీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఎన్‌పీకుంట సమీపంలోని కొత్త రోడ్డు వద్ద మర్రికొమ్మదిన్నె ఫీడర్‌లో విద్యుత్ లైన్ మార్పే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రామ్మూర్తి వద్ద బుధవారం పనికి వచ్చాడు. అయితే కాంట్రాక్టర్ తప్పిదం కారణంగా మర్రికొమ్మదిన్నె ఫీడర్‌కు కాకుండా పెడబల్లి ఫీడర్‌కు ఎల్‌సీ తీసుకుని, వెంటనే పనులు పూర్తి చేయాలని కూలీలను ఆదేశించాడు. దీంతో రవినాయక్ విద్యుత్ స్తంభం ఎక్కి మెయిన్ లైన్ ముట్టుకోగానే షాక్ గురై తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే తోటి కూలీలు కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఘటనపై విద్యుత్‌శాఖ ఏఈ సాలేహబాషా మాట్లాడుతూ.. ఉన్నతాధికారికి తెలపకుండా సిబ్బంది ఎవరూ ఎల్‌సీ తీసుకోకూడదని, తప్పిదం ఎక్కడ జరిగిందో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

తలుపుల: రాజనాలవాండ్లపల్లికి చెందిన వెంకటరమణ, సోదరుడు క్రిష్ణ తమ ఇంటి వద్ద స్థల సమస్యపై బుధవారం ఘర్షణ పడ్డారు. ఇరువర్గాలకు గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని సందర్శించి వెంకటరమణ కుటుంబీకులు ముగ్గురు, క్రిష్ణ కుటుంబీకులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మగ్బుల్‌బాష తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ

కనగానపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఐఓ (జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి) డాక్టర్ కృష్ణయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు చెన్నారెడ్డి, ప్రశాంత్, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు సానే ఆదినారాయణరెడ్డి (80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం కనుముక్కలలో అంత్యక్రియలు నిర్వహించారు. సానే ఆదినారాయణరెడ్డి చెన్నేకొత్తపల్లి ఎంపీపీగా 1987 నుంచి 1992 వరకు పనిచేశారు. పెనుకొండ మాజీ ఎమ్మెల్యే సానే చెన్నారెడ్డికి ఆయన సోదరుడు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, నాయకులు సానే జయరామిరెడ్డి, సానే రాజారెడ్డి, సానే ఉమారాణిలు ఆదినారాయణరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

తనకల్లు: 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శోభా సువర్ణమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి బుధవారం ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోలు మహేష్, నజీర్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: మండల కేంద్రంలో తహసీల్దార్ కే.శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం ఓటర్ల అవగాహన ర్యాలీ విద్యార్థులతో నిర్వహించారు. మెయిన్ రోడ్డు, మూడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా, ఆర్ఐ శ్రీనివాస్, ఏఎస్ఓ భాస్కర్, వీఆర్ఓ జయప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పుట్టపర్తి: పుట్టపర్తిలో బుధవారం నిర్వహించిన వివిధ రకాల జిల్లాస్థాయి పోటీల్లో రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్, పోస్టర్ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నెల 29, 30 వ తేదీల్లో విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. డీఈఓ మీనాక్షి చేతుల మీదుగా వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీ రామకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం

పుట్టపర్తి టౌన్: ప్రతి ప్రయాణికుడు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సురక్షితంగా గమ్యాలకు చేరాలని జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ సూచించారు. బుధవారం పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పుట్టపర్తి–పావగడ నూతన బస్సు సర్వీసును జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పెనుకొండలో ఉదయం 5 గంటలకు బయలుదేరి ఉదయం 6 గంటలకు పావగడకు చేరుకొంటుందన్నారు. అక్కడ నుంచి బయలుదేరి ఉదయం 9కి పుట్టపర్తి వస్తుందన్నారు.

వినియోగదారుల హక్కులు తెలుసుకోవాలి

పుట్టపర్తి టౌన్: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకున్నప్పుడే ప్రశ్నించగలరని రాష్ట్ర వినియోగదారుల సంఘం సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, లీగల్ మెట్రాలజీ అధికారి శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం కొత్తచెరువు బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్ అధ్యక్షతన జాతీయ వినియోగదారులు రక్షణ దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్రన్ , జిల్లా వినియోగదారులు రక్షణమండలి సభ్యురాలు నారాయణమ్మ, కుళ్లాయప్ప, తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కిట్ల పంపిణీ

అమడగూరు: మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైనన్ని పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసినట్లు ఏపీఎం గోపాల్ పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో ప్రతి బడికీ వెళ్లి చిన్నారులకు సరిపడేంత స్టాకు దింపినట్లు తెలిపారు. చిన్నారుల తల్లితండ్రులకు పంపిణీ చేస్తామన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

పుట్టపర్తి టౌన్: క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని ఏఆర్ డీఎస్పీ విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలో ఉన్న ప్రైవేటు గ్రౌండ్‌లో పోలీస్ స్పోర్ట్స్ గేట్‌మీట్ ప్రారంభించారు. ధర్మవరం, పుట్టపర్తి సబ్ డివిజన్ల పోలీస్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. పుట్టపర్తి సబ్ డివిజన్ జట్టు విజయం సాధించింది. సీఐ కొండారెడ్డి, ఆర్ఐలు టైటాస్, రాజశేఖర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పరుగులు పెట్టాలి

పుట్టపర్తి: మండలంలో అభివద్ధి పనులు పరుగులు పెట్టేలా అధికారులు పని చేయాలని బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఆయన అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో భాగవత పఠనం

తాడిమర్రి: స్థానిక శ్రీకాశిరెడ్డి నాయన ఆశ్రమంలో బుధవారం ఆశ్రమ ధర్మకర్తలు భక్తిశ్రద్ధలతో భాగవత పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు భాగవత పఠన, శ్రవణ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలు తెలిపారు. ఆశ్రమంలో భారీగా నిత్యాన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

నగదు రివార్డు

కదిరి అర్బన్: నవంబర్ నెలలో సంస్థకు ఆదాయం పెంచిన కండక్టర్ శ్రీధర్‌కు డీఎం మైనోద్దీన్ రూ.500 రివార్డును మంజూరు చేశారు. బుధవారం అసిస్టెంట్ డిపో మేనేజర్ హరిమోహన్ రివార్డును చెక్కురూపంలో శ్రీధర్‌కు అందజేశారు.

చీనీ మొక్కలు పీకివేత

తాడిమర్రి: మండలంలోని కునుకుంట్ల గ్రామానికి చెందిన మారాల శ్రీనివాసులు భార్య మారాల రుక్మిణికి చెందిన పొలంలో బుధవారం ఉదయం దుండగులు చీనీ మొక్కలను పీకివేశారు. నరసింహారెడ్డి, ఆయన సోదరుడు పెద్దిరెడ్డి మొక్కలను పీకివేసినట్లు బాధితులు ఆరోపించారు. తాడిమర్రి మండల సర్వేయర్ సుశాంతి, రెవెన్యూ సిబ్బంది, ఎస్ఐ నాగస్వామి, సిబ్బంది ఆ భూమిని సందర్శించి రెవిన్యూ రికార్డుల ప్రకారం ఆ భూమి అంజలి, శరత్‌దేవిలకు చెందినగా తెలిపారు. మారాల రుక్మిణీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

అనంతపురం: ఈ నెల 22న కర్ణాటకలోని బెల్గాంలో ఉన్న విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ వేదికగా జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీల వాలీబాల్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఎస్కేయూ జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఈ మేరకు స్పోర్ట్స్ సెక్రెటరీ ఎంవీ శ్రీనివాసన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల్లో బుక్కపట్నంలోని ఎస్ఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చాకలి సాయికిరణ్, షేక్ మన్సూర్ బాషా, కె.మహమ్మద్ హమీద్, పెనుకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి డి.మౌలాసాహెబ్, జగరాజుపల్లిలోని మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులు బి.నజీర్‌హుస్సేన్, పి.అరవింద్, కె.కరుణాకర్, అనంతపురం ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు తలారి సాయి భరత్‌కుమార్, ఎస్.పి.అజిత్ చక్రి, ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థి జి.రామకృష్ణ, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కె.గణేష్, ఎ.శివానంద ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ చింతా సుధాకర్ అభినందించారు.